
Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 93 | గురువారం 04 సెప్టెంబర్ 2025 | పేజీలు : 9 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## రేటు హేతుబద్ధీకరణకు
## జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం

### - ఈ నెల 22 నుంచి కొత్త జిఎస్‌టి రేట్లు అమలు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

జిఎస్‌టిలో తీసుకొచ్చిన సంస్కరణలతో రాష్ట్రాలకు వాటిల్లే నష్టాన్ని పూడ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ సంస్కరణలతో రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వివిధ రాష్ట్రా ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతిపక్ష పాలిత రాష్ట్రా ఆర్థిక మంత్రులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే రేటు హేతుబద్ధీకరణకు జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. జిఎస్‌టిలో ఇక రెండు శ్లాబులే ఉండనున్నాయి. బుధవారం నాడిక్కడ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల నుండి ఆర్థిక మంత్రులు, కేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.2,500 వరకు ధర ఉన్న పాదరక్షలు, దుస్తులపై

- మిగతా 2లో..

## వరద ప్రభావిత రాష్ట్రాలకు
## ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి

### - లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03



వర్షాలకు అతలాకుతలమవుతున్న రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బుధవారం ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో వరద పరిస్థితి మరీ అందోళనకరంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రాలకు సహాయమందించాలని రాహుల్ కోరారు. 'ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుసూ.. వరదలు సంభవించి

- మిగతా 2లో..

## గవర్నర్లు కేవలం
## ప్రతీకాత్మకమే

- చట్టాల రూపకల్పనలో వారికి ప్రమేయం లేదు
- సుప్రీంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల వాదన
- రాష్ట్రపతి ప్రస్తావనపై కొనసాగుతున్న విచారణ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

ప్రజాప్రతినిధులతో కూడిన చట్ట సభలకే చట్టాన్ని చేసే అధికారాలున్నాయని, గవర్నర్లు కేవలం ఆ అధికారాలకు ప్రతీకాత్మక నేతలు మాత్రమేనని, చట్టాలను చేయడంలో వారికి పాత్ర ఉండదని ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో స్పష్టం చేశారు. శాసనసభలు పంపిన బిల్లులను గవర్నర్లు తొక్కిపట్టి జాప్యం చేసే అధికారం లేదన్నారు. రాజ్యాంగంలో చాలా స్పష్టంగా

- మిగతా 2లో..

## సొంతింటితోనే
# పేదల ఆత్మగౌరవం

- రాబోయే రెండేండ్లలో నాలుగున్నర లక్షల ఇండ్లు
- నియోజకవర్గానికో ఏటీసీ కేంద్రం.. ఉపాధికనుగుణంగా నైపుణ్యాల పెంపు
- విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు
- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడులో ఇండ్ల గృహ ప్రవేశం
- పొంగులేటికి సీఎం ప్రశంసల జల్లు



ఖమ్మం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

సొంతింటితోనే పేదలకు ఆత్మగౌరవం దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆత్మగౌరవం నిలిపేలా ఇందిరాగాంధీ తీసుకొచ్చిన 'రోటీ కపడా ఔర్ మకాన్' నినాదం సాకారం దిశగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న ఇండ్లే కాక రాబోయే రెండేండ్లలో నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని,

- మిగతా 2లో..



## కనీసం ఒక యూరియా బస్తా
## అందించలేరా?...

- చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్
- ఏపీలో యూరియా కొరత తీవ్రంగా ఉందంటూ జగన్ ట్వీట్
- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని ఆరోపణ

అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వైసీపీ అధినేత జగన్ ధ్వజమెత్తారు. కూటమి

- మిగతా 2లో..



## రాహుల్‌గాంధీ
## పిల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. అలహాబాద్ హైకోర్టు జడ్జి సమీర్‌జైన్ నేడు కేసును విచారించి, తన తీర్పుని రిజర్వ్ చేశారు. రాహుల్‌గాంధీ అమెరికాలో చేసిన ప్రకటనకు సంబంధించి ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్న పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని మెజిస్ట్రీరియల్ కోర్టును ఆదేశిస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆయన సవాలు చేసిన సంగతి తెలిసిందే. వారణాసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు తప్పని, చట్టవ్యతిరేకమని మరియు అధికార పరిధిలో లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

2024లో అమెరికాలో రాహుల్‌గాంధీ సిక్కులపై అవమానకర వ్యాఖ్యలు చేశారని, ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని వారణాసికి చెందిన

- మిగతా 2లో..

# అనంతలో డిస్నీ వరల్డ్..

- టెంపుల్ టౌన్స్‌లో హోమ్ స్టేలు...
- ఏపీ టూరిజంపై సీఎం చంద్రబాబు మెగా ప్లాన్
- పర్యాటకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలన్న సీఎం చంద్రబాబు
- పర్యాటక రంగంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష
- అరకు కాఫీ, ఎర్రచందనం, చేనేత ఉత్పత్తులతో ఏపీ టూరిజానికి ప్రత్యేక బ్రాండింగ్
- రాజమండ్రిని ప్రత్యేక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రాజెక్టుల రూపకల్పన
- విజయవాడలో మైసూరు తరహాలో అత్యంత వైభవంగా దసరా ఉత్సవాల నిర్వహణ



అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి సరికొత్త రూపునిచ్చి, ప్రపంచ పటంలో రాష్ట్రానికి ప్రత్యేక స్థానం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా, అనంతపురంలో ప్రపంచ ప్రఖ్యాత 'డిస్నీ వరల్డ్ సిటీ' ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, ఆ సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రూపొందించాల్సిన కార్యాచరణపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు కేవలం కొత్త ప్రాజెక్టుల నిర్మాణం మాత్రమే కాకుండా, వారికి మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంపై కూడా

- మిగతా 2లో..



## మద్యం కుంభకోణంలో
## 'సిట్'సోదాలు

### - చెవిరెడ్డికి చెందిన పలు డాక్యుమెంట్లు స్వాధీనం!

తిరుపతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03

లిక్కర్ స్కామ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. చెవిరెడ్డి సొంత ఊరు తుమ్మలగుంటలోని ఆయన ఇంట్లో దాదాపు మూడు గంటల పాటు సోదాలు నిర్వహించారు. చెవిరెడ్డికి సన్నిహితుడైన చిత్తూరు వైసిపి నేత విజయానందరెడ్డి ఇంట్లోనూ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## వరద ప్రభావిత రాష్ట్రాలకు ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

జనజీవనం అస్తవ్యస్థంగా ఉన్న ఇలాంటి క్లిష్ట సమయంలో మీరు (ప్రధాని మోడీ) శ్రద్ధ వహించాలి. ఈ సమయంలో త్వరితగతిన కేంద్ర ప్రభుత్వ సహాయం అందించడం చాలా అవసరం. వేలాది కుటుంబాలు తమ ఇళ్లను, ప్రాణాలను, ప్రియమైన వారిని కాపాడుకోవడానికి కష్టపడుతున్నాయి. అందుకే ఈ రాష్ట్రాలకు ముఖ్యంగా రైతుల కోసం ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని, ఆ ప్రాంతాలలో రక్షణ కార్యకలాపాలను వేగవంతం చేయాలి' అని రాహుల్ ఎక్స్ పోస్టులో మోడీని కోరారు.

## గవర్నర్లు కేవలం ప్రతీకాత్మకమే

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులను 'వీలైనంత త్వరగా పరిష్కరించాలి' అన్న నిబంధన ఉందని, దీనర్థం 'వెనువెంటనే లేదా తక్షణమే' అని పేర్కొన్నారు.

బిల్లులను తమ వద్దనే అట్టిపెట్టుకోవడంలో గవర్నర్లకు గల విచక్షణాధికారాలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు సుప్రీంకోర్టులో బుధవారం వాదించాయి. చట్టాలను చేయడంలో చట్టసభలకు పాత్ర వుంటుంది తప్ప గవర్నర్లకు అందులో ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశాయి. గవర్నర్లకు ప్రతీకాత్మక (నామమాత్రపు) అధికారాలే వుంటాయని పేర్కొన్నాయి. గవర్నర్ల ఇష్టానుసారంమీద ప్రజల అభీష్టం లేదా సంకల్పం ఆధారపడి వుండదని పేర్కొన్నాయి. బిల్లును తన వద్దనే సుదీర్ఘకాలం అట్టిపెట్టుకోవడం లేదా దాన్ని తొక్కిపట్టి వుంచడమంటే బిల్లును ఆమోదించడానికి నిరాకరించడమేనని ఆ మూడు రాష్ట్రాలు పేర్కొన్నాయి. బిల్లులను పరిశీలించేటపుడు గవర్నర్ వంటి ఉన్నత రాజ్యాంగ అధికారి చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తారని కేంద్రం భావించినట్లైతే రాష్ట్రాల శాసనసభల పట్ల కూడా అదే మర్యాద పాటించాలని, ఆ సభలు కూడా ఉన్నత రాజ్యాంగ వ్యవస్థలేనని వాదించాయి. రాష్ట్రపతి పంపిన ప్రస్తావనపై సుప్రీంకోర్టులో ఏడవరోజైన బుధవారం కూడా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగించింది.

**గవర్నర్లకు బిల్లులు పంపేది ఆమోదించడానికే : కపిల్ సిబల్**

ఈ విచారణలో భాగంగా పశ్చిమ బెంగాల్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ..చట్ట సభలు బిల్లులను గవర్నర్లకు పంపేది ఆమోదించడానికేనని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కావాలంటే రాష్ట్ర చట్టాన్ని రద్దు చేయవచ్చని లేదా కోర్టుల్లో సవాలు చేయవచ్చన్నారు. కానీ గవర్నర్లు బిల్లులను తొక్కిపట్టరాదని పేర్కొన్నారు. కేంద్రం కూడా ప్రజల సంకల్పాన్ని, వారి అభీష్టాన్ని గౌరవించాల్సిందేనని తెలిపారు.

హిమాచల్ ప్రదేశ్ తరపున వాదనలు వినిపిస్తున్న కేంద్ర మాజీ మంత్రి, న్యాయవాది ఆనంద్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రపతి లేదా గవర్నర్లు కనీసం పార్లమెంట్‌ను లేదా అసెంబ్లీలను సమావేశపరచడం కూడా చేయరని అన్నారు. ఆ ప్రక్రియ అంతా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. కర్ణాటక తరపున గోపాల్ సుబ్రమణియం మాట్లాడుతూ, ఒకే రాష్ట్రంలో ద్వంద్వ పాలన (గవర్నర్ మరియు రాష్ట్ర ప్రభుత్వం) వుండరాదంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారు.

## రేటు హేతుబద్ధీకరణకు జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

జిఎస్‌టి రేటును 5 శాతానికి తగ్గించడానికి జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రూ. 1,000 వరకు ధర ఉన్న పాదరక్షలు, దుస్తులపై 5 శాతం పన్ను విధిస్తున్నారు. అయితే పరిమితికి మించి వస్తువులపై 12 శాతం జిఎస్‌టి విధిస్తున్నారు. 5 శాతం శ్లాబ్‌లో పాదరక్షలు, దుస్తుల పరిమితిని రూ. 1,000 నుండి రూ. 2,500కి పెంచాలని నిర్ణయించింది. అలాగే 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించి, ఈ శ్లాబుల్లో ఉన్న ఎక్కువ వస్తువులను 5 శాతం, 18 శాతానికి మార్చాలని నిర్ణయించారు. . కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'నెక్ట్స్-జెన్' జిఎస్‌టి సంస్కరణలు, తప్పనిసరి ఉత్పత్తులపై పన్ను భారాన్ని తగ్గించడానికి రెండు పన్ను రేట్లు కలిగిన నూతన విధానం చర్చించారు. ప్రస్తుతం 12 శాతం, 28 శాతం పన్ను శ్లాబ్‌లలో ఉన్న ఉత్పత్తులను తక్కువ రేట్లకు మార్చడం, కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధించడం ఈ ప్రతిపాదనలో భాగంగా ఉన్నాయి. ఈ నెల 22 నుంచి కొత్త జిఎస్‌టి రేట్లు అమలులోకి వస్తాయి. పన్ను రేట్ల తగ్గింపును స్వాగతించినప్పటికీ, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలు సంస్కరణల వల్ల కలిగే ఆదాయ నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాలని తెలిపాయి. ఎనిమిది ప్రతిపక్ష రాష్ట్రాలు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఆదాయ నష్టం గురించి ఆందోళన చెందుతున్నాయి. జిఎస్‌టి సంస్కరణల వల్ల ఏటా ఆదాయంలో రూ. 2 లక్షల కోట్ల నష్టం జరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇవి ప్రధాని మోడీ ప్రకటించిన సంస్కరణలు కాబట్టి, బిజెపి పాలిత రాష్ట్రాలు వాటిని బహిరంగంగా వ్యతిరేకించటం లేదు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ కూడా సంస్కరణలకు తన మద్దతును ప్రకటించింది.

**జిఎస్‌టి సంస్కరణలకు మద్దతు : మంత్రి పయ్యావుల కేశవ్**

జిఎస్‌టి సంస్కరణలకు మద్దతు ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం ప్రతిపాదిస్తున్న జిఎస్‌టి సంస్కరణలను సమర్థిస్తుందని, ఇవి "పేదల్లోని పేదల ప్రయోజనాల కోసం" ఉద్దేశించబడ్డాయని ఆయన చెప్పారు. ఈ సంస్కరణలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "దీపావళి బహుమతి" ప్రకటనకు అనుగుణంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ఆహారం, విద్య, ఆరోగ్యం, ఉక్కు, సిమెంట్, వస్త్ర రంగాలకు సంబంధించిన సంస్కరణలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

## రాహుల్‌గాంధీ పిల్‌పై తీర్పు రిజర్వ్

(మొదటిపేజీ తరువాయి)

నాగేశ్వర్ మిశ్రా అనే వ్యక్తి మెజిస్టీరియల్ కోర్టును కోరారు. రాహుల్ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవి మరియు విబేధాలు సృష్టించేవిగా ఉన్నాయని మిశ్రా ఆరోపించారు. మెజిస్టీరియల్ కోర్టు నవంబర్ 28న ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ ప్రసంగం అమెరికాలో జరిగినందున, తమ అధికార పరిధికి మించినదని పేర్కొంది. ఈ ఉత్తర్వులను నాగేశ్వర్ మిశ్రా రివిజనల్ కోర్టులో సవాలు చేశారు. రాహుల్‌గాంధీపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు రివిజనల్ కోర్టు జులై 21న అనుమతిస్తూ.. ఈ అంశాన్ని తిరిగి పరిగణనలోకి తీసుకోవాలని మెజిస్టీరియల్ కోర్టును ఆదేశించింది. వారణాసిలోని సారనాథ్ పోలీస్ స్టేషన్‌లో రాహుల్‌గాంధీపై మిశ్రా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు యత్నించారు కాని విఫలమయ్యారు.

## సొంతింటితోనే పేదల ఆత్మగౌరవం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నియోజకవర్గానికో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గాల వారీగా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలతో మంత్రులు సమావేశాలు ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దామరచర్లలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. కమ్యూనిస్టులు సైతం ప్రభుత్వానికి అండగా నిలబడ్డారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 25 లక్షల ఇండ్లను కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. హనుమాన్ గుడిలేని గ్రామాలు, తండాలు ఉండొచ్చు కానీ ఇందిరమ్మ ఇండ్లు లేని ఊరు ఉండొద్దని నిర్ణయించుకున్నామన్నారు. నాడు పోడు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంట్.. రాజశేఖర్‌రెడ్డి ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ పదేండ్ల పాలనాకాలంలో కొత్త రేషన్‌కార్డు ఎట్లుంటదో తెలియదని, కోడలు ఇంటికొస్తే.. ఆడపిల్లను ఓ ఇంటికిస్తే కార్డుల్లో పేరు ఎక్కలేదని అన్నారు.

పదేండ్లు కార్డుల కోసం కండ్లు కాయలు కాచేలా చూశారని తెలిపారు. రాబోయే పదేండ్లు ఇందిరమ్మ రాజ్యమే ఉండాలని, పేదలందరికీ ఇండ్లు కట్టించాలని ఆకాంక్షించారు. అందుకు అధికారులు సహకరించాలని కోరారు. భూములు అందుబాటులో లేనందున పేదల పిల్లలను ప్రయోజకులను చేసేందుకు రూ.45వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను స్థాపిస్తున్నామని తెలిపారు. "పేదలూ చదువుకోండి.. చదువుకేమి కావాలో అడగండి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిని ప్రశంసలతో ముంచెత్తారు. ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి ఉన్న జిల్లా అని, అందుకే కీలక శాఖలన్నీ ఈ జిల్లాకే ఇచ్చానని తెలిపారు. అంతకుముందు ఇండ్ల గృహప్రవేశాల అనంతరం లబ్దిదారులతో ముచ్చటించారు.

**పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇండ్లు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

పేదల ఆత్మగౌరవం ఇండ్లని, అటువంటి ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదల కోసం పనిచేస్తే కమీషన్‌లు రావని నాటి ప్రభుత్వం భావించిందని, కానీ పేదలతోనే ఆత్మగౌరవం అని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కేసీఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలో 119 ఇండ్లు కట్టించామన్నారు. నాడు కేసీఆర్‌ను ఇల్లు ఇవ్వమని అడిగిన అవ్వ ఇల్లు కూడా నెలరోజుల్లో పూర్తవుతుందన్నారు.

ఈ సభలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, మాలోత్ రాందాస్‌నాయక్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మువ్వా విజరుబాబు, రాయల నాగేశ్వరరావు, హౌసింగ్ ఎండీ ఎంవీ గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, వరంగల్ రేంజ్ ఐజీ చంద్రశేఖరరెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతలో డిస్నీ వరల్డ్..

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటకుల బస కోసం గదుల కొరత లేకుండా చూడాలని, 2026 మార్చి నాటికి 10 వేల గదులు, 2029 నాటికి ఏకంగా 50 వేల గదులు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. ఈ లక్ష్య సాధన కోసం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణానికి అనువైన స్థలాలను వెంటనే గుర్తించాలని సూచించారు.

ముఖ్యంగా తిరుపతి సహా ఇతర ప్రసిద్ధ ఆలయ నగరాల్లో 'హోమ్ స్టే' విధానాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలిపారు. కోనసీమ సహజ సౌందర్యాన్ని, గ్రామీణ వాతావరణాన్ని పర్యాటకులు ఆస్వాదించేలా అక్కడ ప్రత్యేక హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసాంధ్రులను (ఎన్ఆర్ఐ) కూడా భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ హోమ్ స్టేలు తప్పనిసరిగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.

**కొత్త ప్రాజెక్టులతో పర్యాటకానికి కొత్త శోభ**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యాటకులను ఆకట్టుకునేలా వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో, చింతపల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టు, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖపట్నంలో డాల్ఫిన్ షో వంటివి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గండికోట, తైడ, అరకు, సూర్యలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. చారిత్రక కొండపల్లి ఖిల్లా వంటి కట్టడాలను ప్రైవేటు సంస్థలు దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. రాజమండ్రిని ఒక ప్రత్యేక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, చారిత్రక హేవ్‌లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా మలిచే 'అఖండ గోదావరి' ప్రాజెక్టును త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. స్వదేశ్ దర్శన్, ప్రసాద్ వంటి పథకాల కింద చేపట్టిన బొర్రా గుహలు, సింహాచలం, అన్నవరం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**స్థానిక ఉత్పత్తులతో బ్రాండింగ్.. వైభవంగా ఉత్సవాలు**

ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడానికి స్థానిక ఉత్పత్తులను బ్రాండింగ్‌కు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అరకు కాఫీ, అరుదైన ఎర్రచందనం బొమ్మలు, ఫర్నిచర్, మన సంప్రదాయ కూచిపూడి నృత్యం, మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి చేనేత వస్త్రాలను పర్యాటక కేంద్రాల్లో ప్రదర్శించడం ద్వారా రాష్ట్ర ప్రత్యేకతను చాటాలని అన్నారు.

మరోవైపు, విజయవాడ దసరా ఉత్సవాలను మైసూరు దసరా ఉత్సవాల తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ ఉత్సవాల సమయంలో నగరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణం తీసుకురావాలన్నారు. ఈవెంట్లు జరిగే నగరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యాటకుల భద్రత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని హెచ్చరించారు. ఈ సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్‌గా పాల్గొనగా, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం, రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన కోసం ఎంపిక చేసిన ఆరు పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను ముఖ్యమంత్రి పరిశీలించారు.

## కనీసం ఒక యూరియా బస్తా అందించలేరా?...

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం... రైతులకు కనీసం ఒక యూరియా బస్తాను కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు యూరియా బస్తా కోసం రోజుల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎరువుల కష్టాలు తప్పడం లేదని మండిపడ్డారు. ఇదే సమయంలో ఉల్లి, చీనీ, మినుము వంటి పంటల ధరలు కూడా పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా, ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని అన్నారు.

రాష్ట్రంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ నడుస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రూ. 267లకే దొరకాల్సిన యూరియా బస్తాను ప్రైవేటు వ్యాపారులు అక్రమంగా నిల్వ చేసి, రూ. 200లు అదనంగా వసూలు చేస్తూ అమ్ముకుంటున్నారని తెలిపారు. అక్రమ నిల్వలపై ఎలాంటి తనిఖీలు లేవని, బాధ్యులపై చర్యలు శూన్యమని విమర్శించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాలకు సరైన కేటాయింపులు జరపకపోవడమే ఈ సంక్షోభానికి కారణమని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకే నేరుగా ఆర్‌బీకేల ద్వారా 12 లక్షల టన్నుల ఎరువులను సరఫరా చేశామని జగన్ గుర్తుచేశారు. మార్కెట్ ధర కంటే రూ. 50 తక్కువకే రైతులకు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనిని ఎందుకు చేయలేకపోతోందని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## మద్యం కుంభకోణంలో 'సిట్'సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీలు చేశారు. సోదాల్లో పలు డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ డివైజులను స్వాధీనం చేసుకున్నట్లు, ఇతర ఆధారాలూ సేకరించినట్లు సమాచారం. హైదరాబాదులోని చెవిరెడ్డికి చెందిన సిబిఆర్ ఇన్ఫ్రా కంపెనీలోనూ సోదాలు చేసి, పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి కూడా ఈ మూడు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. లిక్కర్ కేసులో పలువురు వైసిపి సీనియర్ నాయకులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సిట్ అధికారులు బృందాలుగా ఏర్పడి చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి, హైదరాబాద్‌లోని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కంపెనీల్లోనూ సోదాలు చేశారు. చిత్తూరులోని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన ఇన్ఫ్రా కంపెనీ, బివి రెడ్డి కాలనీ, నలందా నగర్, నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లోని కార్యాలయం లోనూ, హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రశాంతి హిల్స్‌లో ఫ్లాట్ నెంబర్ 35లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన కంపెనీలోనూ సోదాలు చేశారు. రికార్డుల్లో కంపెనీల పేరు ఒకలా, భౌతికంగా ఉన్న కార్యాలయాల పేరు మరోలా ఉన్నట్లు పరిశీలనలో తేలినట్టు సమాచారం. చిత్తూరులో రికార్డుల్లో ఉన్న సిఎంఆర్ కంపెనీ వద్దకు తనిఖీకి వెళ్లగా, అక్కడ వెల్ టాస్క్‌ఫుడ్ అండ్ బేవరేజెస్ పేరుతో బోర్డు ఉంది. ఈ కంపెనీ విజయానంద్‌రెడ్డి సంస్థగా గుర్తించారు. ఇక్కడ తనిఖీల్లో రహస్యంగా ఉంచిన మోహిత్ రెడ్డి కంపెనీ వివరాలు, విజయానంద్ రెడ్డి కంపెనీ రికార్డులు లభ్యమైనట్టు సమాచారం. హైదరాబాద్ లోని ప్రశాంతి హిల్స్‌లో భీంస్పేస్ కార్యాలయానికి వెళ్లగా ఇషా ఇన్ ఫ్రాం పేరుతో బోర్డు కనిపించింది. ఈ కంపెనీలో డైరెక్టరుగా సజ్జల భార్గవ రెడ్డి ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

## చేనేత వస్త్రాలు డోర్ డెలివరీ

- అమెజాన్, ఫ్లిప్‌కార్డ్, జియోమార్ట్‌తో అనుసంధానం
- మంత్రి సవిత

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03**

సంప్రదాయ వస్త్రాలతోపాటు రెడీమేడ్ చేనేత దుస్తుల అమ్మకాలు నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసే విధానాన్ని తీసుకొచ్చామని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్ సంస్థలతో అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. రోజురోజుకూ చేనేత వస్త్రాల వినియోగం పెరిగిందన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నేతన్నలకు 365 రోజులు ఉపాధి లక్ష్యమని పేర్కొన్నారు. నేతన్నల అభివృద్ధికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పోచంపల్లి,



ధర్మవరం, మంగళగిరి పట్టు చీరలతోపాటు రెడీమేడ్ దుస్తులను కూడా ఆప్కో షోరూమ్‌లతో పాటు ఆన్‌లైన్‌లోనూ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందన్నారు.

# సంపాదకీయం

## సైలెంట్‌గా అగ్రరాజ్యానికి షాక్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50శాతం సుంకాలు ఎగుమతి రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సుంకాలు భారత వస్త్రాలు, రసాయనాలు, ఆభరణాలు, ఆక్వా రంగాలపై గణనీయమైన ఒత్తిడిని తెచ్చాయి. అయినప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సుంకాలపై బహిరంగంగా స్పందించకుండా, నిశ్శబ్దంగా వ్యూహాత్మక చర్చలకు పరిమితమయ్యారు. మోదీ కాళ్లబేరానికి వస్తాడని భావించిన ట్రంప్‌కు భంగపాటే ఎదురైంది. ఇది భారత దీర్ఘకాలిక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని గుర్తు చేసింది. భారత్ అమెరికా ఒత్తిడికి లొంగకుండా ఇతర దేశాలతో సంబంధాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీంతో సైలెంట్‌గా అగ్రరాజ్యానికి షాక్ ఇవ్వబోతోంది. అగ్రరాజ్యానికి కోపం వస్తే చాలు ఒకప్పుడు ఇండియా ఇబ్బంది పడేది. అగ్రరాజ్యం ఇబ్బంది పడకుండా నడుచుకునేది. తన ఇబ్బంది పడినప్పటికీ అగ్రరాజ్యానికి ఏమీ కాకుండా చూసుకునేది. శ్వేత దేశం నుంచి అధ్యక్షుడు లేదా ఆ స్థాయి వ్యక్తులు వస్తే ఇండియాలో ఒక రకమైన వాతావరణం నెలకొనేది. అధ్యక్షుడి సేవలో తరించేందుకు మన దేశ వ్యవస్థలు పోటీపడేవి.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి.. ఇతర మంత్రులు వంగి వంగి సలాం చేసేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అగ్రరాజ్యం అంటే సులభంగా తీసుకునే స్థాయికి భారత్ వచ్చేసింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయిన తర్వాత అగ్రరాజ్యం విధివిధానాలలో పూర్తిగా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా వాణిజ్యం విషయంలో ట్రంప్ అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. భారత్ అంటే చాలు మండిపడుతున్నారు. టారిఫ్ ల శాతాన్ని పెంచుకుంటూ పోతున్నారు. మొదట్లో అమెరికా తీసుకుంటున్న నిర్ణయం వల్ల మనదేశంలో ఇబ్బందికరమైన వాతావరణం తలెత్తింది. అగ్రరాజ్యం విధిస్తున్న షరతులను భారత్ ఎలా తట్టుకుంటుంది అనే అనుమానం అందరిలోనూ మొదలైంది. అయినప్పటికీ భారత్ 7.8% వృద్ధిరేటును నమోదు చేయడం విశేషం. ఇదే విషయాన్ని సగర్వంగా భారత ప్రధాని ప్రపంచ వేదికల ముందు చెప్పడం గమనార్హం.. సెమికాన్ ఇండియా 2025 సదస్సులో భారత ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాశంగా మారిపోయాయి. గ్లోబల్ పరంగా చూసుకుంటే ఒక రకమైన వాతావరణం ఉంది. కొనుగోలు శక్తి తగ్గిపోయింది. ఉత్పత్తి కూడా పడిపోయింది.

నిరుద్యోగం తారస్థాయికి చేరుకుంది. ఇలాంటి స్థితిలో భారత్ సూపర్ వృద్ధిరేటును నమోదు చేయడం గొప్ప విషయమని భారత ప్రధాని పేర్కొన్నారు. కొంతమంది విచ్ఛిన్నకారులు ఆర్థికంగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించినప్పటికీ భారత్ స్థిరంగా నిలబడిందని ప్రధానమంత్రి కొనియాడారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మైక్రో ప్రాసెసర్ చిప్ లను తయారుచేసి భారతదేశం ప్రపంచ దేశాలకు షాక్ ఇచ్చింది. భారతదేశం విక్రం 32 బిట్ ప్రాసెసర్, 4 చిప్స్ తయారు చేసింది. ఇది తొలి మైక్రో ప్రాసెసర్ చిప్.. దీనిని ఇస్రో సెమీ కండక్టర్ ల్యాబ్ డెవలప్ చేసింది.. వాహక నౌకల్లో.. కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే విధంగా దీనిని రూపొందించారు. సెమీ కండక్టర్ ఎకో సిస్టం ను ఇది పెంపొందిస్తుంది.. అయితే దీనిని కేవలం 3.5 సంవత్సరాల వ్యవధిలోనే భారత్ రూపొందించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఇక మన దేశంలో ఐదు సెమీ కండక్టర్ల నిర్మాణం అత్యంత వేగంగా జరుగుతోంది. దీనివల్ల టెక్నాలజీ మీద భారత్ మరింత గ్రిప్ సాధించనుంది. అగ్రరాజ్యం షరతులు విధించినప్పటికీ.. భారత్ ఏ మాత్రం భయపడలేదు. అంతే కాదు తన ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే మార్గాలను సుగమం చేసుకుంది. అందువల్లే మోడీలో ఈ స్థాయిలో కాన్ఫిడెన్స్ పెరిగింది. అది భారతదేశాన్ని మరింత ఆర్థికంగా శక్తివంతంగా మార్చేందుకు సహకరిస్తోంది. శాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడం, భారత్?చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్?చైనా సంబంధాలు, ఇటీవలి కాలంలో స్థిరీకరణ దిశగా సాగుతున్నాయి. ఈ సమావేశంలో మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు పరస్పర విశ్వాసం, ఆర్థిక సహకారం ఆధారంగా సంబంధాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా, రెండు దేశాలు సరిహద్దు వివాదాలపై చర్చలను కొనసాగించడం, విమానాలు పునరుద్ధరించడం, వీసా నిబంధనలను సడలించడం వంటి చర్యలను చేపట్టాయి. ఈ చర్యలు ట్రంప్ సుంకాలకు ప్రతిస్పందనగా భారత వ్యూహాత్మక ఆలోచనను ప్రతిబింబిస్తాయి, ఇది అమెరికాపై ఆధారపడకుండా ఆసియా, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య సంబంధాలను విస్తరించే దిశగా సాగుతోంది. 2020 గల్వాన్ లోయ ఘర్షణలో భారత సైనికులు ప్రదర్శించిన పోరాట పటిమ చైనాకు భారత సైనిక సామర్థ్యాన్ని స్పష్టం చేసింది. గడ్డకట్టే చలిలోనూ భారత సైనికులు చూపిన ధైర్యం, చైనాతో సమాన స్థాయిలో చర్చలు జరిపేందుకు భారత్‌కు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఈ ఘటన తర్వాత, ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలపై చర్చలు కొనసాగుతున్నాయి, ఇవి శాంతి, స్థిరత్వాన్ని కాపాడే దిశగా ముందుకు సాగుతున్నాయి. ఈ సందర్భంలో, భారత్ తన సైనిక, ఆర్థిక శక్తిని ఉపయోగించి, చైనాతో సమతుల్య సంబంధాలను నిర్మించే ప్రయత్నంలో ఉంది, అదే సమయంలో అమెరికా ఒత్తిడిని తట్టుకుంటోంది.

భారత్ తలొగ్గకపోవడంతో ట్రంప్ ఇప్పుడు మరో ఎత్తుగడ వేశారు. భారత్?ఇజ్రాయెల్ మధ్య ఆయుధ సాంకేతికత బదిలీని నియంత్రించాలని భావిస్తున్నప్పటికీ, భారత్ ఇప్పటికే ఇజ్రాయెల్ డ్రోన్‌లను ఆపరేషన్ సిందూర్ వంటి కార్యక్రమాల్లో విజయవంతంగా ఉపయోగించింది. ఇది భారత్ యొక్క సాంకేతిక సామర్థ్యాన్ని, ఇజ్రాయెల్‌తో బలమైన భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. అదే విధంగా, ట్రంప్ యూరోపియన్ యూనియన్‌ను భారత్‌పై సుంకాలు విధించమని ప్రోత్సహిస్తు న్నప్పటికీ, యురోపియన్ యూనియన్ దీనికి సుముఖంగా లేదు. 2002 గుజరాత్ అల్లర్ల తర్వాత అమెరికా, యురోపియన్ యూనియన్ ఆంక్షలు విధించినప్పటికీ, 2007లో యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు గుజరాత్‌లో పర్యటించి, అమెరికా ఒత్తిడి లేకుండా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ప్రస్తుతం, రష్యా నుంచి దిగుమతి చేసుకున్న గ్యాస్‌ను భారత్ యురోపియన్ యూనియన్‌కు ఎగుమతి చేస్తోంది, ఇది యూరోపియన్ యూనియన్‌తో బలమైన వాణిజ్య సంబంధాలను సూచిస్తుంది.

ఈ నేపథ్యంలో, ట్రంప్ సుంకాల వ్యూహం యూరోపియన్ యూనియన్‌పై ప్రభావం చూపే అవకాశం తక్కువ. భారత్ గతంలో 1998 అణు పరీక్షల తర్వాత, 2002 గుజరాత్ అల్లర్ల తర్వాత అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షలను ఎదుర్కొంది. అయినప్పటికీ, ఈ ఆంక్షలను అధిగమించి, 2014లో అమెరికా మోదీని రెడ్ కార్పెట్‌తో స్వాగతించింది. ఈ చరిత్ర భారత్ విదేశీ ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యాన్ని చూపిస్తుంది. ప్రస్తుత ట్రంప్ సుంకాల సవాల్‌ను కూడా భారత్ వ్యూహాత్మకంగా ఎదుర్కొంటోంది. ఎస్‌సీవో సమావేశంలో చైనాతో సంబంధాలను బలోపేతం చేయడం, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్యాన్ని విస్తరించడం, ఇజ్రాయెల్, యూరోపియన్ యూనియన్‌లతో సహకారాన్ని కొనసాగించడం ద్వారా భారత్ తన స్వయంప్రతిపత్తిని నిరూపిస్తోంది.

# నేడు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం




నగరం నిద్రపోతున్న వేళ... తొలి కోడి కూతకు ముందే అతడు మేల్కొంటాడు. రవి కిరణాలు ప్రసరించక మునుపే.. ఎముకలు కొరికే చలిలోనూ ప్రపంచాన్ని గుప్పిట పట్టి ఆ సంగతులన్నింటినీ ఇంటింటికీ చేరవేస్తాడు. తానెవరో కూడా కన్పించక... ఇలా వచ్చి, అలా వెళ్లిపోతాడు. పేరుకు మాత్రమే అతడు పేపర్ బాయ్...కానీ, అతడో సామాజిక సారథి.. వార్తా పత్రికలను పాఠకులకు చేర్చే నిత్య నూతన వారధి. అతనికి కూడా ఒక రోజు వుందోచ్.. ఈరోజు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ఫ్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. మొట్టమొదటి పేపర్ బాయ్ అమెరికాకు చెందిన బార్నీ ఫ్లాహెర్టీ. ఆ రోజుల్లో పేపర్ వెయ్యాలంటే అక్కడి ప్రజలు నామోషీగా భావించేవారు. బార్నీ మాత్రం డిగ్నిటీ ఆఫ్ లేబర్ అన్నట్టు తన పరిస్థితికి తగ్గట్టు తాను పేపర్ బాయ్‌గా చేస్తే తనకు ఖర్చులకు డబ్బులు వస్తాయని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా పేపర్ బాయ్ గా చేరిపోయాడు. 1833 నాటికి అతడి వయస్సు 10 సంవత్సరాలు. ఆయన అప్పట్లో న్యూయార్క్ సన్ పేపర్ వేసేవాడు. తెల్లవారకముందే దిన పత్రిక ఇంటికి చేరవేస్తుండడంతో ఇతర పేపర్ల వినియోగదారులు సైతం బార్నీ వేసే న్యూయార్క్ సన్ పేపర్‌నే కోరుకున్నారు. దీంతో అనతికాలంలోనే ఆ పత్రిక చందాదారులు రెట్టింపయ్యారు. బార్నీ అనంతరం మరికొందరు పేపర్ బాయ్‌గా చేరినా వారందరికీ అతడే ఆదర్శంగా నిలిచారు. బార్నీ సేవలు గుర్తించిన పత్రికా యాజమాన్యం అతడికి మరిన్ని బాధ్యతలు అప్పగించింది. పేపర్ బాయ్‌గా చాలా మంది పాఠకుల హృదయాల్లో స్థానం సంపాదించిన బార్నీ పుట్టినరోజు (సెప్టెంబర్ 4)ను ఆయా పత్రికా సంఘాల నాయకులు పేపర్ బాయ్స్ డే గా ప్రకటించారు. నాటి నుంచి ప్రపంచంలోని అన్ని పత్రికల యాజమాన్యాలు బార్నీ పుట్టిన రోజున పేపర్ బాయ్స్‌డేగా ఫాలో అవుతున్నాయి. ఇదిలా ఉండగా అమెరికాలోని హ్యూస్టన్‌లో టెక్సాస్ ప్రెస్ అసోస్సియేషన్ 125 వార్షికోత్సవం సందర్భంగా బార్నీ గౌరవార్థం అతడి కాంస్య విగ్రహాన్ని 2005లో ఏర్పాటు చేసింది. కత్తిమీద సాము లాంటిదే పేపర్‌బాయ్ పని అంటే.. ఏదో పేపర్లు తీసుకొని ఉదయం ఇళ్ల వద్ద వేసి వెళ్లిపోతారని అనుకుంటారు అంతా. అయితే ఇందులో ఉన్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎందరో పాత్రికేయులు రేయింబవళ్లు శ్రమించి సేకరించిన వార్తలను సబ్‌ఎడిటర్లు సరిచేసి ముద్రణ ఆమోదయోగ్యంగా మలుస్తారు. ఆ తర్వాత ముద్రించబడ్డ దిన పత్రికలను పాఠకులకు చేరవేయాల్సిన బాధ్యత పేపర్‌బాయ్‌లదే. తెల్లవారు జామున 3.30 గంటలకు ముందే పేపర్‌బాయ్‌లు నిద్రలేచి సైకిల్‌పై బయలుదేరి పేపర్ కట్టలు వచ్చే పాయింట్లకు చేరుకుంటారు. దినపత్రికలను సర్దుకున్నాక పై అంతస్థులో ఉన్న ఇళ్లకు పేపర్‌ను ఎగర వేసేందుకు తాడుతోనూ, పేపర్‌నే పొట్లంగా మలిచి ఆ కట్టలను సైకిల్‌పై సర్దుకుని బయలు దేరుతారు. తమ ఖాతాదారులకు పత్రికలు వేసుకుంటూ ముందుకు సాగిపోతారు. పేపర్ వేసే క్రమంలో సైకిల్ లేదా ద్విచక్ర వాహనం మరమత్తులకు గురవడం, ఆరోగ్యం బాగలేక నిద్రలేవడం ఆలస్యమైతే ఇక తిట్ల దండకాలే. బిల్లులు సకాలంలో వసూలు చేయకపోతే ఏజెంట్లు జీతాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయడం ఇలా చాలా బాధలే ఉన్నాయి.... ఎందరో మహనీయులు: భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్‌బాయ్‌గా పని చేశారు. తన విద్యార్థి దశలో పుస్తకాల ఖర్చుల కోసం తెల్లవారుజామునే లేచి ఇంటింటా పేపరు వేసేవారు. ఇక ప్రఖ్యాత జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ కూడా పేపర్‌బాయ్‌గా పని చేశారు. స్వాతంత్రోద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న రోజుల్లో బాలగంగాధర్ తిలక్ సైతం పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్‌బాయ్‌గా పనిచేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మహనీయులు, మహాను బావులు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే.

### స్వరాజ్య అనే పదం మొట్టమొదట వాడిన

# ధీరుడు దాదాభాయ్ నౌరోజీ

**- భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో నౌరోజీ ఒకరు**
**- నేడు ఈ స్వాతంత్ర్య సమరయోధుని జయంతి**



భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందునుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తిన ధీరుడు, స్వరాజ్య అనే పదం మొట్టమొదట వాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు దాదాభాయ్ నౌరోజీ. దాదాభాయ్ నౌరోజీ మంచి విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకుడు. ఇతను 1892 నుండి 1895 వరకు పార్లమెంట్ సభ్యుడిగా యున్కెటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగాడు. ఇతను అలాంటి గౌరవం పొందిన మొదటి ఆసియా వ్యక్తి. ఈయన ను గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా అని అంటారు. నౌరోజీ భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకడు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించాడు. 1886 నుండి 1887 వరకు, 1893 నుండి 1894 వరకు మరియు 1906 నుండి 1907 వరకు మూడు సందర్భాలలో దాని అధ్యక్షుడిగా పనిచేశాడు. ఇతను రాసిన పుస్తకం పావర్టీ అండ్ అన్‌బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ కు తరలిస్తున్న నిధుల గురించి మాట్లాడిన మొదటి పుస్తకం. భారతదేశంలో తొలితరం పారిశ్రామికవేత్త జె.ఆర్.డి. టాటా లాంటి వారికి ఆయన మార్గదర్శి. నౌరోజీ 1825 సెప్టెంబరు 4న, అప్పటి బొంబాయి రాష్ట్రంలోని నవసార (ప్రస్తుతం గుజరాత్) అనే ప్రాంతంలో ఒక పార్శీ కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి పలన్ జీదోరోజి జొరాష్ట్రియన్ మతపురోహితుడు. ఎల్ఫిన్‌స్టోన్ పాఠశాలలో చదివాడు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల విద్యనభ్యసించాడు. ఆయన 11 సంవత్సరాల వయసులో గుల్బాయిని వివాహం చేసుకున్నారు. తర్వాత తాను చదివిన కళాశాలలోనే గణిత శాస్త్రం, తత్వశాస్త్రం బోధించే ఆచార్యుడిగా నియమితుడయ్యాడు. విద్యారంగంలో కొనసాగుతూనే వాణిజ్యంలోకి కూడా అడుగుపెట్టాడు. వ్యాపార నిమిత్తం 1855 లో ఇంగ్లండు వెళ్ళిన నౌరోజీ భారతదేశపు స్థితిగతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పాడు. అక్కడ కొంత మంది భాగస్వాములతో కలిసి కామా అండ్ కంపెనీ అనే సంస్థను ప్రారంభించాడు. ఆ కాలంలో బ్రిటన్ లో తొలి భారతీయ కంపెనీ అదే. ఆ కంపెనీ మద్యం, నల్లమందు వ్యాపారం చేస్తుండటంతో కొద్దికాలానికి అందులోనుంచి బయటకు వచ్చాడు. 1859 లో తానే స్వంతంగా దాదాభాయి నౌరోజీ కాటన్ ట్రేడిరగ్ కంపెనీని ప్రారంభించాడు. ఆ బాధ్యతలు నిర్వహిస్తూనే లండన్ యూనివర్శిటీ కళాశాలలో గుజరాతీ ఆచార్యుడిగా నియమితుడయ్యాడు. భారతదేశపు రాజకీయాలు, సంస్కృతి, సాహిత్యం మొదల్కెన విషయాలు చర్చించేందుకు లండన్ ఇండియన్ సొసైటీని ప్రారంభించాడు. భారతీయులు పడుతున్న కష్టాలు గురించి తెలుసుకునేందుకు ఈస్టిండియా అసోసియేషన్ ఏర్పాటు చేశాడు. ఈ సంఘాల ద్వారా భారతీయులు పడుతున్న కష్టాలను గురించి ఆంగ్లేయులపై ఒత్తిడి తేవాలని అతని ఆలోచన. వివిధ సంఘాలను ఏకం చేసి 1885 లో భారత జాతీయ కాంగ్రెస్ ని ప్రారంభించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. దానికి మూడు సార్లు అధ్యక్షుడిగా పనిచేశాడు. ఒక కుటుంబంలో సమస్య వస్తే పిల్లలు తండ్రి వైపు ఎలా చూస్తారో, భారతదేశానికి సమస్య వస్తే అతని వైపు చూస్తుందని గాంధీ నౌరోజీని ప్రశంసించాడు. 1892 లో నౌరోజీ లండన్ వెళ్ళి అక్కడి లిబరల్ పార్టీ తరపున పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. అలా ఎన్నికైన తొలి భారతీయుడు. పార్లమెంటులో భారతీయుల స్థితిగతులను గురించి వివరిస్తూ, అక్కడి వారికి స్వయంప్రతిపత్తి కలిగించాలని తన గళం వినిపించాడు. బ్రిటన్ భారతదేశం నుంచి సంపదను తరలించుకుపోతూ దేశాన్ని ఎలా దివాలా తీయిస్తుందో ఒక పుస్తకం రాశాడు.

ఆ ప్రభావంతో ఆంగ్లేయ ప్రభుత్వం భారత్‌లో పరిపాలనా సంస్కరణలు చేపట్టింది. కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా ఉన్న అతివాదులు, మితవాదులకు ఇష్టమైన వ్యక్తిగా పేరు పొందాడు. బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలే లకు రాజకీయ గురువు. ఇతను 1917 జూన్ 30 న 91 ఏండ్ల వయసులో బొంబాయిలో మరణించాడు. నౌరోజీకి భారతదేశంలో.. యున్కెటెడ్ కింగ్‌డమ్ రెండిరటిలోనూ మరణానంతరం గుర్తింపు లభించింది. 2014లో బ్రిటిష్ ప్రభుత్వం దాదాభాయ్ నౌరోజీ అవార్డులను ప్రవేశపెట్టింది, దీనిని యూకే-భారతదేశ సంబంధాలకు చేసిన కృషిని గౌరవించటానికి ఏర్పాటు చేసింది. ఇండియా పోస్ట్ 1963,1997, 2017లో ఆయన ఫోటోతో పోస్టల్ స్టాంపులను విడుదల చేసి ఆయనను స్మరించుకుంది.

# పార్టీ దిశగా కవిత అడుగులు

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇక స్వతంత్రంగా రాజకీయాలు చేయాలని నిర్ణయించు కున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవు లన్నింటినీ వదులుకోవాలని డిసైడయ్యారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయా లని అనుకుంటున్నారు. . కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఉన్నారు. కవిత పదవీ కాలం 2028 జనవరి నాలుగో తేదీ వరకూ ఉంది. రెండేళ్ల మూడు నెలల వరకూ పదవీ కాలం ఉంది. కవిత రాజీనామా చేస్తే ఉపఎన్నికలు ఖాయంగా జరుగుతాయని అనుకోవచ్చు. 2022లో జరిగిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని బలం ఉండటంతో పోటీకి ఎవరూ నిలబడలేకపోయారు. అంతకు ముందు అదే స్థానానికి 2020లో జరిగిన ఉపఎన్నికల్లో ఏకపక్షంగా గెలిచారు. ఇప్పుడు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేస్తే మండలి చైర్మన్ వెంటనే ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. అంటే ఆ స్థానం ఖాళీ అయిపోతుంది. రెండేళ్లకుపైగా పదవి కాలం ఉన్నందున ఎన్నికల సంఘం ఉపఎన్నిక నిర్వహిస్తుంది. ఆ ఎన్నికలో కవిత పోటీ చేసే అవకాశాలు ఉండకపోవచ్చు. కానీ బీఆర్ఎస్ పార్టీకి అడ్వాంటేజ్ తక్కువగా ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీల బలాబలాల్లో పూర్తిగా మార్పు వచ్చింది. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పట్టు కోల్పోయింది. బీఆర్ఎస్ అభ్యర్థి పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చాలా వరకూ పార్టీలు మారిపోయారు. బీజేపీ కాంగ్రెస్‌లలో చేరిపోయారు.

ఇప్పుడు స్థానిక సంస్థల ఉపఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ తన ఓటర్లను కాపాడుకోవడం చాలా కష్టం . అందుకే ఆ పార్టీకి చాలా తక్కువ అవకాశాలు ఉంటాయి. అంటే కవిత రాజీనామా చేస్తే.. ఓ ఎమ్మెల్సీ స్థానం కోల్పోయినట్లు అవుతుంది.

# సేవల ముసుగులో 'స్వచ్ఛంద సంస్థ'ల దోపిడీ...

- ప్రభుత్వ ధనం దొంగలపాలు
- సేవలు చేసింది శూన్యం...
- రూ.కోట్లు స్వాహా..



**అనంతపురం బ్యూరో– సూర్య వాస్తవం, సెప్టెంబరు 3 :** అనంతపురం జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు సేవల ముసుగులో కోట్ల రూపాయల దోపిడీ పాల్పడుతున్నాయి. ప్రజలకు సేవలు చేస్తున్నట్టు నటిస్తూ కోట్లరూపాయలను స్వాహా చేస్తున్నాయి. జిల్లాలో కొన్ని వందల స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. వారి ఆసక్తి బట్టి వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. విదేశాల నుంచి నిధులు సేకరించడం, దాతల నుంచి విరాళాలు సేకరించడంతో పాటు ప్రభుత్వ శాఖలోని కొన్ని విభాగాలల్లో కూడా భాగస్వామ్యంగా ఉన్నాయి. ముఖ్యంగా రైతులకు చెట్ల పంపిణీ, విత్తనాల సేకరతో పాటు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించడం, 15 రకాల అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. రాయదుర్గం, గుత్తి, అనంతపురం, హిందూపురం, కళ్యాణదుర్గం, కదిరి ప్రాంతాల్లో బోగస్ స్వచ్ఛంద సంస్థలు వందల్లో ఉన్నాయి. ఇలాంటి బోగస్ సంస్థల వల్ల నిజంగా పేదలకు సేవలు అందించే స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందడం లేదు.

**కళ్యాణదుర్గం, గుత్తి, రాయదుర్గంలో అవినీతి ఎక్కువ...** కళ్యాణదుర్గం, గుత్తి, రాయదుర్గంలో ఉన్న కొన్ని స్వచ్ఛంద సంస్థలు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ప్రభుత్వ నిధులన్నీ వారి జేబుల్లోకి వెళ్లాయి. కొన్ని కోట్ల రూపాయలు అవినీతి జరినట్టు తెలుస్తోంది. 2015 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం లోపల సుమారు 500 కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు జరిగినట్టు సమాచారం. ముఖ్యంగా కళ్యాణదుర్గం, గుత్తి, రాయదుర్గంలలో అయితే రైతులు, ప్రజలకు అందిన ప్రతి సేవల్లో కమీషన్లు దండుకున్నట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో జరిగిన పనులు వేరు, కాగితాల్లో చూపే లెక్కలు వేరు. గుత్తిలో అయితే అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు. కనీసం సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వ నిధుల వ్యయాలు, ఇతర ఖర్చుల వివరాలు అడిగినా ఇవ్వడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది.

**చర్యలు తీసుకోకున్న ఉన్నతాధికారులు**

జిల్లా కలెక్టరు, ఉన్నతాధికారుల దృష్టికి స్వచ్ఛంద సంస్థల అవినీతి, అక్రమాలు వెళ్లినట్టు సమాచారం. ఇప్పటికే వారి వద్ద అవినీతి, అక్రమాల చిట్టా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రజలకు సేవలు అందించకుండానే కోట్ల రూపాయలు స్వాహా చేసిన ఘటనపై కలెక్టరు కూడా సీరియస్‌గా ఉన్నారు. త్వరలో చర్యలు తీసుకోకున్నారు. బోగస్ స్వచ్ఛంద సంస్థల వల్ల నీతి, నిజాయితీగా పని చేస్తున్న కొన్ని స్వచ్ఛంద సంస్థలకు నిదులు ఆందడం లేదు. అనంతపురం జిల్లాలో కొన్ని బోగస్ స్వచ్ఛంద సంస్థల అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా రానున్న కథనాల్లో చూద్దాం.

## వ్యాధి నిరోధక టీకాలు సీజనల్ వ్యాధులపై అవగాహన





**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** మండలపరిదిలోని వేపరాల, కురుమామిడి పంచా యితీలో పాయ కట్టు పోతుల వాండ్లపల్లి గ్రామాలలో బుధ.వారం వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర మారుతి గర్భ వతులకు, చిన్న పిల్లలకు ఇచ్చు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించుచు గర్భవతులు తరచు ఆరోగ్య పరీక్షలు చేయించుకొనవలనని, పౌష్టికాహారము తీసుకొనవలయునని, సకాలములో వ్యాది నిరోదక టీకాలు వేయించుకొని, ఆసుపత్రి లోనే కాన్పు చేయించు కొనవలెనని, బిడ్డకు పుట్టిన గంట లోపే తల్లి పాలు పట్టించ వలెనని తెలియజేశారు. అదేవిధంగా వ్యాది నిరోదక టీకాలు సకాలంలో వేయించి పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యముగా ఎదగవలయునని అదేవిధంగా సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించుచు ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పరిసరాలు,వ్యక్తి గత శుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది అని ఆయన ప్రజలకు తెలియజేశాడు. డ్రైడే, ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలని అవగాహన కల్పించి దోమ పుట్ట కూడదు అని తెలియజేశారు. అదేవిధంగా దోమ కుట్ట కూడదు తెలియజేశారు. చిన్నదోమ పెను ప్రమాదం దోమతెరలు వాడాలని తెలియజేశారు.దోమకాటు పెను ప్రమాదం అని ఆయన తెలియజేశారు.నీటి నిల్వలు దోమలకు ఆవాసాలు వేపాకు పొగ దోమలుకు సెగ అనీ తెలియజేశారు. అదేవిధంగా మలేరియా, డెంగ్యూ వంటి వాటిని దూరంపెట్టండి అని కోరారు. ఈకార్యక్రమంలో సామజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్ వైజర్ ఉపేంద్ర రెడ్డి ఎల్ హెచ్ పి లు రాజేశ్వరి, శిరీష ఆరోగ్యకార్యకర్తలు సీతమ్మ,పుష్ప,భవానీ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన యువనేత

**పామిడి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** పామిడి మండలం దిబ్బసాని పల్లి గ్రామం నందు మజ్జిగ లక్ష్మీదేవి గారి ఇల్లు షార్ట్ సర్క్యూట్ అయ్యి పూర్తిగా కాలిపోవడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న లి?గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ దిబ్బసానిపల్లి గ్రామానికి వెళ్లి బాధిత మహిళ అయిన మజ్జిగ లక్ష్మీదేవిని పరామర్శించి 10,000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి వారి కుటుంబానికి అండగా ఉంటామని అలాగే పార్టీ తరఫున చేయవలసిన సహాయం కూడా ఖచ్చితంగా దగ్గరుండి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### పేదలు, బలహీన, బడుగు వర్గాలకు,

# పెద్దపీట వేసింది జగన్ ప్రభుత్వమే

- పెమ్మాడపల్లె గ్రామం గరుగుపల్లెలో పర్యటించిన శ్రీకాంత్ రెడ్డి



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** పేదలుబలహీన,బడుగు వర్గాలకు, పెద్దపీట వేసింది జగన్ ప్రభుత్వమేనని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు.బుధవారం రాయచోటి మండలం పెమ్మాడపల్లె గ్రామంలోని గరుగుపల్లెలో శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. ప్రజలు వై,ఎస్ఆర్ సిపి కార్యకర్తలతో ఆయన మమేకమయ్యారు. అందరినీ పేరు, పేరునా ఆప్యా యంగా..ఆత్మీయ అనురాగాలతో పలకరించారు. ఈ సందర్భంగా గరుగుపల్లె వాసులు శ్రీకాంత్ రెడ్డి తో మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం లో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. వర్షాభావ పరిస్థితులతో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, ఎటువంటి పంటల నష్టపరిహారం,ఇన్ ఫుట్ సబ్సిడీ లు అందడం లేదని వారు ఆవేదనగా చెప్పారు.ఈ ప్రభుత్వంలో తొలిఏడాది రైతు భరోసా డబ్బులు కూడా అందివ్వలేదని రైతులు వాపోయారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మా ఊరికి జరిగిన అభివృద్ధిని మేము మరచి పోలేం గరుగుపల్లె ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో తమ ప్రాంతానికి విశేష అభివృద్ధి జరిగింది అంటూ గరుగుపల్లె గ్రామస్తులు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట కృతజ్ఞతలు తెలిపారు.మీ నాయ కత్వం లో మా ఊరికి జరిగిన అభివృద్ధి చరిత్రలో నిలిచి పోతుంది. ఆ మేలు మాకు మర్చిపోలేనిదని వారు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గరుగుపల్లెకు 380 పక్కా గృహాలు మంజూరు, గ్రామ రహదారుల అభివృద్ధి, విలేజ్ క్లినిక్ నిర్మాణం, ఆలయం నిర్మాణం, ప్రాథమికోన్నత



పాఠశాలని పదవ తరగతి వరకు ఉన్నత పాఠశాల గా అప్‌గ్రేడ్ చేయడం, చెరువుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందించడంలాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాలను గ్రామస్తులు గుర్తు చేశారు.

**శ్రీకాంత్ రెడ్డి కి ఘన స్వాగతం:** గరుగుపల్లె కు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి కి ఎంపిపి పల్లపు రాజమ్మ, వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్ ల ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలు,యువత వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతాలు పలికారు. వినాయక చవితి మహోత్సవాలు భక్తి, శాంతి, ఐక్యతకు ప్రతీకగరుగుపల్లె లో ఏర్పాటైన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీకాంత్ రెడ్డి వినాయక చవితి మహోత్సవాలు భక్తి, శాంతి, ఐక్యతకు ప్రతీక అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.గరుగుపల్లె లో ఏర్పాటైన వినాయక మండపాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తీర్థ ప్రసాదాలు అందించి శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. వినాయకుడి దీవెనలతో వర్షాలు సంవృద్దిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలు, సురేంద్ర, ప్రసాద్, దేవేంద్ర, రమణ, సుబ్బారాయుడు, రాజు, బసవరాజు, గంగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



### పత్తికొండ పట్టణంలో

# ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలి : సీపీఐ

**పత్తికొండ టౌన్ –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** పత్తికొండ పట్టణంలోని ప్రధాన రహదారులు రోడ్లు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు సీపీఐ మండల కార్య దర్శి కారుమంచి ధర్నా కార్యక్రమం నిర్వ హించిన అనంతరం వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంక్రాంతికి రహదారులు మొత్తం గుంతల మయం లేకుండా ప్రజలందరికీ సౌకర్యవంతమైన రహదారులు రిపేర్లు చేయిస్తామని హామీ ఇచ్చి నేటికి కూడా పత్తికొండ పట్టణంలో ఎక్కడ గుంతలు అంబేద్కర్ సర్కిల్ కోరమండల్ సుంకన్ గేట్ ల దగ్గర గుంతలు ఉండటం వల్ల విద్యార్థులు ప్రభుత్వ పని మీదకు వచ్చే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేటువంటి రోగులు ఇటు వాహనదారులు గుంతల వల్ల చాలాసార్లు ప్రమాదాలు జరిగి కొంత మంది చనిపోవడం కూడా జరిగింది.




అయినప్పటికీ కూడా ఆర్ఎంబి అధికారులకు వామపక్షాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చిన కూడా రహదారుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు కావున ఆర్ఎం బి అధికారులు నిర్లక్ష్యం వీడి పట్టణంలో గుంతలు పడినటువంటి రోడ్లను మరమ్మత్తు చేయించండి లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ గా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి రాజా సాహెబ్ గురుదాస్, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, జె కాసిం, నెట్టికంటయ్య అల్తాఫ్ అశోక్ రాజప్ప, మాదన్న, హనుమన్న, ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# గెలుపు ఒక చరిత్ర, హామీలు అమలు ఇంకో చరిత్ర

**- అందుకే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభ**
**- ప్రభుత్వ విప్ కాల్వ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**- ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో సభా స్థలికి భూమి పూజ**
**కార్యక్రమంలో పాల్గొన్న మూడు పార్టీల కీలక నాయకులు, ఎమ్మెల్యేలు**





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** రాష్ట్రంలో 164 స్థానాలతో అధికారంలో రావడం ఒక చరిత్ర అయితే 15 నెలల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇంకో చరిత్ర అని.. ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి, పరిటాల శ్రీరామ్ అన్నారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయోత్సవ సభను అనంతపురంలో జరగనుండగా ఇందుకు సంబంధించిన సభాస్థలికి ఇవాళ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి నాని, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, బీజేపీ నేతలు రాజేష్, సందిరెడ్డి శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, కూటమి పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 15 నెలల్లో 5 కీలక హామీలు నెరవేర్చమన్నారు. ఇంకో హామీ నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో నెరవేర్చిన హామీలను ఏడాది గడవకముందే నెరవేర్చడం అన్నది అత్యంత సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. జగన్ విధ్వంసకర పాలనలో పది లక్షల కోట్లు అప్పులు మిగిల్చిపోతే.. దానిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఊహించని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మరో 15 సంవత్సరాలు ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రజలు కూడా భావిస్తున్నారన్నారు. 15 నెలల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అందుకే ప్రజలంతా సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటున్నారన్నారు. ఈనెల 10న బహిరంగ సభ నిర్వహించబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు 164 మంది ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మొత్తం 3.50లక్షల మంది ఈ సభకు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ పాలన సాగుతోందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చి.. ఆ సంతోషాన్ని పంచుకునేందుకు సక్సెస్ మీట్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గతంలో మూడు పార్టీ కలిసి మంచి విజయాన్ని సాధించామని.. ఇప్పుడు హామీల అమలుపై మేమంతా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పండుగలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు పార్టీల నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. మరోవైపు టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పినట్టుగా మా పార్టీలు కలిసి సుపరిపాలన అందిస్తామని.. ఇప్పుడు చెప్పిన ప్రకారమే అది చేసి చూపిస్తున్నామన్నారు. మరో 15ఏళ్ల పాటు ఈ ఐక్యత ఉంటుందని.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే మా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, జె ఎల్ మురళీధర్, వీరశైవ లింగాయత కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న, మాజీ ఎంపీ సైఫుల్లా, టిడిపి రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, సింగవరం రవి, జిరయతి గౌస్ మోద్దిన్, టిడిపి జిల్లా నాయకులు సరిపూటి రమణ, కోణంకి గంగారం, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, రాజారావు, సరళ, కుంచెపు వెంకటేష్, దలవాయి వెంకటనారాయణ, సంగా తేజస్విని టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### శాంతియుతంగా మిలాద్ ఉన్ నబీ
## పండుగను జరుపుకోవాలి
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** మిలాద్ ఉన్ నబీ పర్వదినం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదే శించారు. పోలీసు అధికారులు శాంతి కమిటీల సమావేశాలు నిర్వహించి మత సామరస్యంతో పండుగ ర్యాలీ కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన ముస్లిం సోదరులు నిర్వహించే ర్యాలీలు, ఊరేగింపులు జరిగే ప్రాంతాలలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.మసీదులు, దర్గాలు వంటి పవిత్ర స్థలాల వద్ద ముందుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలు శాంతియుతంగా పండుగను జరుపుకునేలా చూడాలని...ముస్లిం సోదరులు సహకరించి పోలీసులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

### ఫత్తు మియా మస్జిద్‌లో
## ఘనంగా ఉరుసు వహోత్సవం
**- మహమ్మద్ ప్రవక్త వస్తు విశేషాలు ప్రదర్శన**

**సిద్దవటం - సూర్యవాస్తవం సెప్టెంబర్ 3:** మండలకేంద్రమైన సిద్దవటం ఫత్తుమియా మస్జిద్‌లో అసార్-ఏ -షరీఫ్‌లో భాగంగా బుధవారం రాత్రి ఉరుసు మహెరీత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీస్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త వస్తువిశేషాలను తిలకించేందుకు ప్రజల ఎదుట ప్రదర్శించడం జరిగిందన్నారు. అలాగే మహమ్మద్ ప్రవక్త కుమార్తె అయిషా, అల్లుడైనా హజరత్ అలీ, వారి మనవడు ఇమాం హుస్సేన్ కు సంభందించిన వస్తు విశేషాలు, మహబూబ్ శుభహాని వస్తు విశేషాలు ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తవలి కుమారుడు నిజరే ఆలం ఖాద్రి, ఇమాం పీర్ బాషా ఖాద్రి, ముస్లిం సహోదరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెట్టకుండా ఒంటిమిట్ట సీఐ బాబు ఆధ్వర్యంలో సిద్దవటం ఏఎస్ఐ బాబయ్య, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



### పౌష్టికాహార
## పక్షోత్సవాలను జయప్రదం చేయండి
**- జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాష**



**సిద్దవటం- సూర్యవాస్తవం, సెప్టెంబర్ 3:** పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంలో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో "మన పిల్లలే మన ఆస్తి భవిష్యత్తు వారి ఆరోగ్యాలను కాపాడుకుందామనే నినాదంతో ప్రత్యేక కరపత్రాలను డాక్టర్ దివ్య రాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య రాణి మాట్లాడుతూ పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన ఆహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. తగిన పౌష్టికాహారం తీసుకోకపోతే పిల్లలు రక్తహీనత, బలహీనత, ఎదుగుదల లోపం వంటి అనేక వ్యాధులకు గురవుతారని హెచ్చరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాష మాట్లాడుతూ "పిల్లల ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. శాస్త్రీయ అవగాహనతో ప్రతి కుటుంబంలో పౌష్టికాహార అలవాట్లను పెంపొందించాలన్నారు. ముఖ్యంగా మన సంప్రదాయ ఆహార భాగమైన చిరుధాన్యాలను (సజ్జలు, రాగులు, కొర్రలు మొదలైనవి) పిల్లల ఆహారంలో చేర్చడం వల్ల బలాన్నీ, రోగనిరోధక శక్తినీ పెంచుకోవచ్చున్నారు. పిల్లల భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉండాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మొత్తం పౌష్టికాహారంపై అవగాహన కలిగి పిల్లలకు సమతుల ఆహారం అందించాలని పిలుపునిచ్చారు.

### రైతు సేవా కేంద్రం, ప్రైవేటు
## ఫర్టిలైజర్ షాపులలో యూరియా స్టాక్ పై తనిఖీ
**- జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** అన్నమయ్య జిల్లాలోని రాయచోటి మండలం చిన్న ముక్క పల్లి-2 లోని రైతు సేవ కేంద్రం, రాయచోటి లోని ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులలో అందుబాటులో ఉన్న యూరియాస్టాక్ పై బుధవారం ఉదయం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్న ముక్క పల్లి -2 లోని రైతు సేవ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ నిలువచేసిన యూరియా స్టాక్ ను పరిశీలించి వ్యవసాయ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాయచోటి తాసిల్దార్ నరసింహా కుమార్ తో కలిసి రాయచోటి లోని జాఫర్ సాబ్ ఫర్టిలైజర్ షాపును ఆకస్మిక తనిఖీ చేసి ఆషాపు యాజమాన్యం నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.

అనంతరం దిగువ అబ్బవరం గ్రామంలో జరుగుతున్న స్వామిత్ర సర్వే కార్యక్ర మాన్ని పరిశీలించి మండల సర్వేయర్‌కు, పంచాయతీ సెక్రెటరీ తగు సూచనలు జారీ చేశారు.

# పీ-4 కార్యాచరణలో అద్భుత ఫలితాలు

## - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**విజయవాడ- సూర్యవాస్తవం, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ప్రతిరూపమైన పీ4 మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యరూపం దాల్చగా నేడు ముప్పాళ్లలో మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు అందుతున్న సహాయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమం లో భాగంగా మార్గదర్శి బంగారు కుటుంబాలతో లబ్ధి పొందుతున్న కొండ్రు వెంకటరావమ్మ, కోట వెంకటరత్నం ఇళ్ళకు బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆర్‌డీవో కె.బాలకృష్ణతో కలిసి వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వారి స్థితిగతులు, ఆదాయ పెరుగుదలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ మేరకు కొండ్రు వెంకటరావమ్మ బంగారు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, ఇంటి మంజూరు, ఆటో, కుట్టు మిషన్, కోట వెంకట రత్నం బంగారు కుటుంబానికి ఆటో ఇప్పించడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించి పేదరికం నుంచి బయటపడే వరకు మార్గదర్శులు తోడుండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.పీ4 కార్యక్రమం మహాయజ్ఞం వంటిదని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పీ4 కార్యక్రమం కార్యరూపం దాల్చడం, జిల్లా అధికారిగా నాకు గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలో 96 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, వీటికి మార్గదర్శులను తోడు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మార్గదర్శుల స్ఫూర్తితో ముందడుగు వేసేందుకు మరింత మంది మార్గదర్శులు ముందుకు రావాలన్నారు. బంగారు కుటుంబాలకు, సహాయాన్ని స్వయంగా వారే అందించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషిచేయడం ద్వారా రాబోయే తరంలో వారి కుటుంబ సభ్యులకు ఒక మంచి కార్యక్రమాన్ని అందించామనే సంతృప్తి మార్గదర్శులకు మిగుల్చుతుందనే దాంట్లో ఎలాంటి సందేహం లేదని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.పర్యటనలో ఎంపిడివో పద్మజ్యోతి, తహశీల్దార్ రామకోటేశ్వరావు ఉన్నారు.

# మదనపల్లెలో అమానుష ఘటన

## -వ్యాపారిపై పెట్రోల్ పోసి తగలబెట్టిన ఉన్మాదులు...




**మదనపల్లి సూర్యవాస్తవం, సెప్టెంబర్ 3:** అన్నమయ్య జిల్లాలో ఉన్మాదులు రెచ్చి పోయారు. వ్యాపారి పై పెట్రోల్ పోసి తగలబెట్టడంతో కొంత శాతం కాలి పోయాడు. మదనపల్లెలో బుధవారం ఉదయం వెలుగు చూసిన అమానుష ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బి.కే పల్లి వైఎస్ఆర్ కాలనీ లో కాపురం ఉంటూన్న మహబూబ్ బాష ఇంట్లో గత ఐదేళ్లుగా అదే ప్రాంతానికి చెందిన రమేష్ నాయక్ (45) చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. తన అంగడి ఇంటి షెట్టర్ పగల గోడుతుంటే వెళ్లి నా షట్టర్ ఎందుకు పగల గొడుతున్నారని రమేష్ నాయక్ వెళ్లి గొడవ చేస్తున్న వారిని నిలదీశాడు. దీంతో రెచ్చిపోయిన ఉన్మాదులు ఖాదర్ వల్లి, ఖాలేషా మరికొంత మంది వెంట తెచుకున్న పెట్రోల్ ను రమేష్ నాయక్ మీద పోసి తగల బెట్టి పరారయ్యారు. మంటల్లో చిక్కుకుని కేకలు పెడుతున్న బాధితున్ని కుటుంబీకులు గమనించి, మంటలు ఆర్పి వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు గల పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

# వినాయకుని పూజలో పాల్గొన్న మంత్రి





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** అన్నమయ్య జిల్లా రాయచోటి లోని మున్సిపాలిటీ పరిధిలో రాజులకాలనీలో వెలసిన వినాయకుని విగ్రహం దగ్గర కాలనీవాసుల తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న వినాయకుని విగ్రహం దగ్గర భక్తులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు..

# వాల్మీకి బోయలను ఎస్‌టిలో చేర్చాలి

## - ఏ.పీ.వీ.బీ.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు
## -ఎంపి అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఇల్లు ముట్టడి






**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకి బోయలను ఎస్.టి లో చేర్పించాలనీ డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ (ఏ.పీ.వి.బి.ఎస్) సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు అనంతపురం జిల్లా ఎంపి అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఇల్లు ముట్టడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు, ఉపాధ్యక్షుడు కేశవ, అనంతపురం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేష్,స్టేట్ యూత్ వింగ్ క్రాంతి కుమార్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రమేష్,మేకల శివ,నాగేంద్ర, బాలకృష్ణ మరియు కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ లను అక్రమంగా అరెస్టు చేసి నాల్గవ పోలీసు స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ యొక్క వాల్మీకి ఉధ్యమ కారులందరూ కలిసి జాతి కోసం ఇలాంటి అక్రమ అరెస్టులకు భయ పడేది లేదని ఏది ఏమైనా సరే ఎస్టీ సాధనకై నిరంతరం గల్లీ నుంచి డిల్లీ వరకు పోరాటం చేసి ఎస్టీ హక్కును సాధించుకుంటామని యావత్తు వాల్మీకి సహోదరు లందరికి తెలియజేస్తూ ఈ ఉధ్యమాన్నీ ఇంతటితో ఆపకుండా మరింతగా ఉధృతంగా చేస్తామని జై వాల్మీకి అనే నినాదంతో నాయకులకు హెచ్చరించడం జరిగింది. ఈరోజు ఇళ్ళు ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీయొక్క వాల్మీకి సహోదరు లందరికి ఏ.పీ.వి .బి .ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు.

# కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు




**లక్కిరెడ్డిపల్లి-సూర్య వాస్తవం , సెప్టెంబర్ 3 :** విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీడీవో ఉషారాణి పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్లో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఉషారాణి, ఎంఈఓ వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మాధ్యమికంలోనే భవిష్యత్తును ఎంపిక చేసుకొని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ లోనే ఏం చదివినా అదే జీవితంలో నిలబడుతుందని డాక్టర్ ఇంజనీర్ ఐఏఎస్ ఐపీఎస్ మరెన్నో ఉన్నత పదవులు దృష్టిలో పెట్టుకొని చదువుకోవాలన్నారు. ముఖ్యంగా మానవత విలువలతో చదువుకోవాలని 2013 వ సంవత్సరం నుంచి ఏపీ మోడల్ స్కూల్లో 10 ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఆమె అభినందించారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది మంచి ఉద్యోగాలు సంపాదించారని తెలిసిందన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మన ఊరికి మంచి పేరు తేవాలని ఆమె తెలియజేశారు. సెప్టెంబర్ నుంచి బాగా చదివితే ఫిబ్రవరి నెలలో పరీక్షలు పూర్తవుతాయని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యనమల మనీ విశ్వనాథ్ వైస్ ప్రిన్సిపల్ రాజకుమార్ సంబేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ కార్యకర్త భీమన్న అంత్యక్రియలో పాల్గొన్న కదిరి శాసనసభ్యులు





**తనకల్లు - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3 :** శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలో దిరుగువ తొట్లిపల్లి పంచాయతీ ముల్లోళ్ళ పల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భీమన్న అధిక అప్పుల భారంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ భీమన్న అంత్యక్రియలో పాల్గొని వారి పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తెలియజేసిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అంతక్రియల్లో తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తను పరామర్శించిన రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి



**గాండ్లపెంట- సూర్యవాస్తవం, సెప్టెంబర్ 3 :** మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు ప్రమాదవశాత్తు గాయపడి ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్దవటం దర్గా అభివృద్ధికి కృషి

## - రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ గౌరవ సభ్యులు బేపారి జాకీర్ అహమ్మద్



**సిద్దవటం- సూర్యవాస్తవం, సెప్టెంబర్ 3 :** వక్ఫ్ బోర్డ్ ద్వారా వక్ఫ్ బోర్డ్ ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు సిద్దవటం దర్గా అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ గౌరవ సభ్యులు బేపారి జాకీర్ అహమ్మద్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఫత్తు మియా మస్జీద్ లో అసారే - షరీఫ్ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆయన సిద్దవటం కు విచ్చేశారు. ఆయనకు ఫత్తు మియా మస్జీద్ ముత్తవలి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి ఆయన కుమారుడు సయ్యద్ నిజరే ఆలం ఖాద్రి లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రాచీన మహమ్మద్ ప్రవక్త యొక్క చారిత్రాత్మక అవశేషాలను పదిలంగా ఉంచడంతో ముస్లిం సహోదరులు ప్రతి ఏటా సందర్శించడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఖ్యాతిని రాష్ట్ర నలువైపుల విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ముత్తవలి అభివృద్ధి చేస్తున్నారని వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## జింక్ న్యూట్రియంట్ ప్లస్ వాటర్ బాటిల్
# వ్యాపార ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** రాయచోటి పట్టణంలోని ఏజీ గార్డెన్స్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జింక్ న్యూట్రియంట్ ప్లస్ వాటర్ బాటిల్ గోడౌన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి .ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపలకు ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని అందించాలని కోరారు.




# కిష్కింధపురి బిజినెస్ సంగతేంటి?

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ మరికొద్ది రోజుల్లో కిష్కింధపురి మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రీసెంట్ గా భైరవంతో వచ్చిన ఆయన.. ఇప్పుడు కిష్కింధపురితో బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే ఆ సినిమాపై మంచి బజ్ క్రియేట్ అవ్వగా.. తాజాగా ట్రైలర్ వాటిని మరింతగా పెంచింది.కౌశిక్ పగళ్లపూడి దర్శకత్వం వహించిన ఆ సినిమాను షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ మూవీని సెప్టెంబర్ 12వ తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి అవ్వగా.. రిలీజ్ కు తొమ్మిది రోజుల ముందే ప్రమోషన్స్ లో జోరు పెంచారు. ట్రైలర్ నూ విడుదల చేసేశారు.ఊరికి ఉత్తరాన.. దారి దక్షిణాన.. పశ్చిమ దిక్కు ప్రేతాత్మలన్నీ అంటూ అదిరిపోయే ఎలివేషన్ తో మొదలైన ట్రైలర్.. మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. దీంతో బెల్లంకొండ శ్రీనివాస్ కు సూపర్ హిట్ దక్కనుందని అంతా అంచనా వేస్తున్నారు. సినిమాపై మంచి హోప్స్ కూడా పెట్టుకుంటున్నారు.అయితే కిష్కింధపురి థియేట్రికల్ బిజినెస్ కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆంధ్ర హక్కులను రూ.3 కోట్లకు సేల్ చేశారని తెలుస్తోంది. నైజాం రైట్స్ ను రూ.1.5 కోట్లకు.. సీడెడ్ హక్కులను రూ.కోటికి అమ్మారని సమాచారం. అదే సమయంలో మేకర్స్ మంచి ప్లాన్ తో తక్కువ రేట్లకే సేల్ చేశారని టాక్ వినిపిస్తోంది.నాన్ రికవరబుల్ అడ్వాన్సుల రూపంలో హక్కులను అమ్మినట్లు తెలుస్తోంది. నార్మల్‌గా ఏపీ రైట్స్ ను రూ.5 కోట్లకు.. నైజాం మూడు కోట్ల రేంజ్ లో అమ్మవచ్చని అభిప్రాయపడుతున్నారు. సినిమాపై నమ్మకంతో నామినల్ రేట్స్ కు ఇచ్చారని చెబుతున్నారు.

ఏదేమైనా సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రావడం పక్కా.కాగా.. సినిమా విషయానికొస్తే.. యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఆమె.. బెల్లంకొండతో రాక్షసుడు మూవీకి గాను స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ కిష్కింధపురిలో యాక్ట్ చేస్తున్నారు. రాక్షసుడుతో మంచి హిట్ అందుకున్న వారిద్దరూ.. ఇప్పుడు మళ్లీ విజయం సాధించేలా కనిపిస్తున్నారు.

# దీపికా యాక్షన్ లోకి దిగేదప్పుడే!






ఇండియన్ సినిమాలో మోస్ట్ అవెయిటెడ్ సినిమాగా తెరకెక్కుతున్న సినిమా AA22xA6 .ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా పాన్ ఇండియా డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఈ సినిమా వస్తోంది. పుష్ప2 తర్వాత బన్నీ నుంచి, జవాన్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత అట్లీ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టు పై అనౌన్స్‌మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. రంగంలోకి హాలీవుడ్ టెక్నీషియన్లు ఆ అంచనాలకు ఏ మాత్రం తీసిపోకుండా అట్లీ ఈ ప్రాజెక్టును తెరకె క్కిస్తున్నారు. ఈ సినిమా కోసం భారీ క్యాస్టింగ్ తో పాటూ హాలీవుడ్ టెక్నీషియన్లను కూడా రంగంలోకి దించారు అట్లీ. ప్రస్తుతం ప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతుంది. అల్లు అర్జున్ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటుండగా బాలీవుడ్ సూపర్ స్టార్ దీపికా పదుకొణె ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. యాక్షన్ సీన్స్ చేయనున్న దీపికా ఇండియన్ సినీ చరిత్రలో అతిపెద్ద సినిమాల్లో ఒకటిగా తెరకెక్కుతున్న ఈ మూవీ లో దీపికా క్యారెక్టర్ చాలా డిఫరెంట్ గా ఉంటుందని, ఈ సినిమాలో దీపికా పలు యాక్షన్ సీన్స్ కూడా చేయనున్నట్టు సమాచారం.

తాజా సమాచారం ప్రకారం దీపికా ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్ నుంచి మొదలుపెట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ మూవీ కోసం దీపికా 100 రోజుల డేట్స్ ను కేటాయించారని సమాచారం. కెరీర్ లోనే నెవర్ బిఫోర్ రోల్.. నవం బర్ నుంచి దీపికాపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటూ మరికొంత డ్రామాను తెరకెక్కించనున్నారట అట్లీ. AA22xA6లో దీపికా క్యారెక్టర్ నెవర్ బిఫోర్ లా ఉంటుందని, సినిమాలో ఆమె క్యారెక్టర్ కోసం స్పెషల్ వారియర్ లుక్‌ను వెపన్స్ తో రూపొందించినట్టు తెలుస్తోంది. అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాలో పలు లుక్స్ లో కనిపించనున్నారు.



# దబాంగ్ ఢిల్లీ ఘన విజయం



- ప్రొ కబడ్డీ సీజన్-12



**విశాఖపట్నం:** ప్రొ కబడ్డీ సీజన్-12 లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ ఘన విజయం సాధించింది. బెంగళూరు బుల్స్‌తో ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు 41-34 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి అర్ధభాగం ముగిసేసరికే భారీ ఆధిక్యతను సంపాదించిన రెండో అర్ధభాగంలో కొంత వెనుకబడింది. ఢిల్లీ రైడర్ అషు మాలిక్(15పాయింట్లు) సత్తా చాటగా.. నీరజ్ నర్వాల్(7) రాణించాడు. ఇక డిఫెండర్ సుర్జీత్, సౌరభ్ మూడేసి పాయింట్లతో రాణించి ఢిల్లీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఇక బెంగళూరు బుల్స్ జట్టులో అలీరెజా(10)

ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చగా.. ఆకాశ్, యోగేశ్ మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. మంగళవారం జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్టు 39-36పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌ను చిత్తుచేసింది. మ్యాచ్ ప్రారంభం నుంచి పట్నాపై ఆధిక్యతను సంపాదించిన జైపూర్ జట్టు చివరి వరకు ఆ ఆధిక్యతను నిలబెట్టుకుంటూ వచ్చింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి జైపూర్ జట్టు 11-8పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది.



# సెమీస్‌కు పెగూలా

## - క్వార్టర్స్‌కు సిన్నర్, మసెట్టి
## - యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి అమెరికాకు చెందిన 4వ సీడ్ జెస్సికా పెగూలా ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో పెగూలా 6-3, 6-3తో వరుససెట్లలో అన్‌సీడెడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రేజీకోవాను చిత్తుచేసింది. తొలి సెట్‌లో 4-3పాయింట్ల ఆధిక్యతలో నిలిచిన పెగూలా.. ఆ తర్వాత వరుసగా పాయింట్లు సాధించి ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్‌లోనూ స్థానిక క్రీడాకారిణి ముందు క్రేజీకోవా నిలువలేకపోయింది. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి మరో అమెరికా క్రీడాకారిణి ప్రవేశించింది. మంగళవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో 8వ సీడ్, అనిసిమోవా 6-0, 6-3తో వరుససెట్లలో 18వ సీడ్, బ్రెజిల్‌కు చెందిన హడాడ్ మయాను చిత్తుచేసింది. ఏకపక్షంగా సాగ ఈ మ్యాచ్ కేవలం గంటలోపే ముగిసింది. ఇక 3వ సీడ్, అమెరికా యువ సంచలనం కోకో గాఫ్ అనూహ్యంగా ప్రి క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. ప్రి క్వార్టర్స్‌లో గాఫ్ 3-6, 2-6తో 23వ సీడ్, జపాన్‌కు చెందిన ఒసాకా చేతిలో పరాజయాన్ని చవిచూసింది.

ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, 10వ సీడ్, ఇటలీకే చెందిన మసెట్టి ప్రవేశించారు. ప్రి క్వార్టర్స్‌లో సిన్నర్ 6-1, 6-1, 6-1తో 23వ సీడ్, బుబ్లిక్(కజకిస్తాన్)ను, ముసెట్టి 6-3, 6-0, 6-1తో స్పెయిన్‌కు చెందిన మునార్‌ను ఓడించారు.

# యూరియా అందుబాటుపై దుష్ప్రచారాన్ని అరికట్టాలి

## - గ్రామ స్థాయి వరకు అందుబాటులో ఉన్న యూరియా పై సమాచారాన్ని రైతులకు అందుబాటులో ఉంచాలి : జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి







**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 03:** అన్నమయ్య జిల్లాలో గ్రామస్థాయి వరకు అందుబాటులో ఉన్న యూరియాపై సమాచారాన్ని రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతి లోని సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలతో ఎరువుల అందుబాటుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు సమీక్ష సమావేశాన్ని నిర వ్రహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ లు రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యారు. సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ... కొన్ని ప్రాంతాలలో యూరియా కొరతను కృత్రిమంగా సృష్టించారని జిల్లాలలో కొరతలేదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దీనికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఎస్పీలను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో మండల, గ్రామ స్థాయిలలో రైతులకు అందుబాటులో ఉన్న యూరియా పై తగిన సమాచారాన్ని చేరవేసి యూరియా పై ఉన్న దుష్ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మండల, గ్రామస్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ లేదా పెల్లి కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారిని ఆదేశించారు.

# తైక్వాండో పోటీలలో మండల విద్యార్థికి బంగారు పతకం



**సిద్ధవటం - సూర్యవాస్తవం, నవంబర్ 3:** అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి టైక్వాండో పోటీలలో సిద్ధవటం మండల విద్యార్థికి బంగారు పతకం లభించింది. ఎస్. రాజంపేట గ్రామం ఎస్సీ కాలనీ నందు నివాసమున్న భవనాసి సుశాంత్ అనే విద్యార్థికి రాయలసీమ టైక్వాండో ఛాంపియన్ షిప్ లో జోనల్ స్థాయిలో బంగారు పధకం లభించడంతో ఆ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థి తండ్రి బి మునెయ్య మాట్లాడుతూ సిద్ధవటంలోని శ్రీ భారతి హై స్కూల్ నందు 6 వ తరగతి చదువుతున్న సుశాంత్ ఛాంపియన్ లో జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో బంగారు పథకం సాధించాడన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల కృషి పట్టుదల వల్ల విజయం సాధించామని స్కూల్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# క్లస్టర్ మేనేజర్ ఆధ్వర్యంలో కీర్తన గోల్డ్ లోన్ నూతన శాఖ ప్రారంభం



**కనేకల్ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3 :** కనేకల్ పట్టణంలో కీర్తన గోల్డ్ లోన్ నూతన శాఖను క్లస్టర్ మేనేజర్ నాగరాజు, విపి నరేష్ ,బిల్డింగ్ ఓనర్ చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కీర్తన గోల్డ్ లోన్ అధికారులు మాట్లాడుతూ ప్రజలు కీర్తన గోల్డ్ లోన్ ద్వారా అందించే ఫైనాన్స్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. మీ బంగారు ఆభరణాలపై కీర్తన సంస్థలు లోన్ ను అందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కీర్తన గోల్డ్ లోన్ సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

# భారత క్రీడాకారులుగా ఎదగాలి

## - క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** క్రీడాస్ఫూర్తితోఆటలుఆడాలని భవిష్యత్తుకాలంలో భారత క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి. ఐఏఎస్ సూచించారు.స్థానిక ఆర్ డి టి స్టేడియంలో బుధవారం ఉదయం జరిగినఏ సి ఏ అండర్ - 19 క్రికెట్ టోర్నీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆంధ్ర ప్రెసిడెంట్ వర్సెస్ బరోడా జట్లమధ్య నిర్వహించిన మ్యాచ్ కు టాస్ ద్వారా టోర్నీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ టీంల క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ అనంత వేదికగా జరుగుతున్న క్రికెట్ టోర్నీలో భవిష్యత్తు భారతదేశ క్రీడాకారులుగా రాణించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి . ఐఏఎస్ పిలుపునిచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఆర్డిటి క్రీడా మైదానంలో ఏసీఏ అండర్- 19 క్రికెట్ టోర్నమెంట్ప్రారంభించడం తనకుఎంతో సంతోషంగా ఉందన్నారు.అన్ని క్రీడలకు అనంతపూర్ ఆర్‌డిటి చాలా గర్వకారణం అని కొనియాడారు. అనంతపురం వేదికగా దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీని విజయవంతంగాగతఏడాదినిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమని కొనియాడారు. క్రీడాకారులకు ఈ టోర్నీ ఎంతో దోహదం చేస్తుందని తమ క్రీడా ప్రతిభ పటావాలతో రాణించడం ద్వారా భవిష్యత్తు క్రీడాకారులుగా ఎదిగేందుకు ఎంతో అవకాశాలు ఉంటాయన్నారు. అండర్ 19 క్రీడా పోటీలు భవిష్యత్తును మలుపు తిప్పే క్రీడా పోటీలని వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. క్రికెట్‌తో తనకు చాలా అనుబంధం ఉందని అంతేగాక తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని తాను కూడా విజయవాడ వేదికగా జరిగిన ఐఏఎస్ క్రికెట్ లీగ్ పోటీలలో తమ జట్టు విజేతగా నిలిచిందన్నారు. క్రీడాకారులకు ఇదో మంచి అవకాశమని ఇందులో బాగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుత తరుణంలో యువతతో పాటు ఇతరులు కూడా క్రీలా పట్ల ఆసక్తి కలిగి ఉండి ఆయాక్రీడల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరిక దృఢత్వం పెరుగుతుందని తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని పేర్కొన్నారు. యువత దురవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగా నోతోడ్పడ తాయన్నారు. క్రీడల నుంచే గెలుపు ఓటముల గురించి యువతకు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి భీమ లింగారెడ్డి, ఏ సి ఏ జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ అచ్యుతారావు, సెలెక్టర్ లీలా మోహన్ రెడ్డి, ట్రెజరర్ షబ్బీర్ అహ్మద్, మాజీ రంజీ ప్లేయర్ సురేష్, మాజీ కార్యదర్శులు రామలింగారెడ్డి, డిఆర్ ప్రసన్న ఎడిసిఏ నెంబర్ టీవీ చంద్రమోహన్ రెడ్డి, విజయ్ కుమార్, మొహమ్మద్ రఫీ, సర్దార్ డిసిసిఐ లెవెల్ టు కోచ్ శ్రీనివాస్ రెడ్డి సీనియర్ క్రీడాకారులు కమలాకర్ నాయుడు ,కోచ్ లు ఆర్ కుమార్ నరేష్ ఆర్ ప్రవీణ్ , ఇనాయకుల్లా మ్యాచ్ అఫీషియల్స్ అన్సర్, ఖాన్ ,సాయిరాం, సుదర్శన్, అక్కులన్న పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటించనున్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జిఎంఆర్ గ్రౌండ్స్, ఇంద్రప్రస్థ వద్ద సూపర్ సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ లు పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం ఈ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి.జగదీష్ , జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ , గుంటూరు మేయర్, ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి నాని, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తదితరులు పరిశీలించారు. మ్యాప్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించి వివరాలను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు ఆరా తీశారు. హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్, తదితర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంతపురం ఆర్డిఓ కేశవ నాయుడు, డిపిఓ నాగరాజునాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, తహసిల్దార్లు హరికుమార్, మోహన్ కుమార్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# డీపీఆర్ఓ పి.వెంకట్రమణ సేవలు ఎనలేనివి

## - డి ఐ పి ఆర్ ఓ : బాలకొండయ్య



**అనంతపురం - సూర్య వాస్తవం,సెప్టెంబర్ 03 :** సమాచార పౌర సంబంధాల శాఖలో జిల్లాలో డి పి ఆర్ ఓ పి.వెంకట్రమణ అందించిన సేవలు ఎనలేనివని తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాకు వెంకట్రమణ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది వెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో డిఐపిఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ... చాలాసంవత్సరాల సుదీర్ఘ కాలంగా వివిధ హోదాల్లో వెంకటరమణ సమాచార పౌర సంబంధాల శాఖ లో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారున్నారు. చిత్తూరు జిల్లా నుంచి సాధారణ బదిలీలో భాగంగా అనంతపురము జిల్లాలో డిపి ఆర్ఓగా పనిచేస్తూ శాఖకు వన్నె తెచ్చారన్నారు. బాపట్ల అసిస్టెంట్ డైరెక్టర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి భవిష్యత్తులో వెంకటరమణ మరిన్ని పదవులు పొంది సమాచార శాఖ ఉన్నతికి దోహదపడాలని డిఐపిఆర్ బాలకొండయ్య ఆకాంక్షించారు. అనంతరం సన్మాన గ్రహీత వెంకటరమణ మాట్లాడుతూ అనంత పురం లో పనిచేసిన కాలంలో కార్యాలయపు అధికారి , ఉద్యోగ సిబ్బంది అందించిన సహకారం జీవితంలో మరువలేనిదని విధినిర్వహణలోతనకు ప్రోత్సహించినందుకు ఆయన పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డి పి ఆర్ ఓ వెంకట రమణను ఆత్మీయ సత్కారం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో సూర్య నారాయణరెడ్డి, ఏపీ ఆర్వో ఫక్రుద్దీన్, సీనియర్ నాయకులు ప్రభావతి, దామోదర్ రెడ్డి, కమల్, ఆంజనేయులు, భాస్కర్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )